# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-04-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్ర పర్యాటక ప్రాంతంగా పేరొందిన బారువ తీరాన్ని మరింత అభివృద్ధి చేయనున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు అన్నారు.**

2. **రాష్ట్రాన్ని అగ్ని ప్రమాద రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తున్నట్లు హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు.**

3. **ప్రజల ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.**

4. **పట్టణాలు, నగరాల్లో ఈ-వ్యర్థాలు పూర్తి స్థాయిలో సేకరించాలని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు.**

===========================

రాష్ట్ర పర్యాటక ప్రాంతంగా పేరొందిన బారువ తీరాన్ని మరింత అభివృద్ధి చేయనున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా బారువ సముద్ర తీరంలో ఇచ్చాపురం శాసన సభ్యులు బి. అశోక్‌తో కలిసి ఆయన ఆలివ్ రిడ్లే తాబేళ్లను సముద్రంలో ఈ రోజు విడిచి పెట్టారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ… ప్రజల్లో ప్రకృతి పరిరక్షణ పట్ల అవగాహన కల్పించడం, ముఖ్యంగా అంతరించిపోతున్న ఆలివ్ రిడ్లే తాబేళ్ల ప్రాముఖ్యతను తెలియజేయడం. ఈ ఉత్సవం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. భావితరాలకు మనం అందించే స్వచ్ఛమైన ప్రకృతి కోసం చేసే ప్రయత్నంలో ఒక ముఖ్యమైన అడుగు పడిందని అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి ప్రతిపాదనలు రూపకల్పన జరుగుతోందని తెలిపారు. మత్స్యకారులు కోరున్న విధంగా బారువ తీరంలో జట్టీ, హార్బర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి మాట్లాడుతూ…

..వాయిస్….21 సెకన్లు….

---------------------------

రాష్ట్రాన్ని అగ్ని ప్రమాద రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తున్నట్లు హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా విజయవాడ ట్రెండ్ సెట్ మాల్‌లో అగ్నిమాపక శాఖ నిన్న నిర్వహించిన మాక్ డ్రిల్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ… అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమం

నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 1944 ఏప్రిల్ 14న ముంబయి ఓడ రేవులో అతి పెద్ద అగ్ని ప్రమాదం జరిగిందని, అందులో 66 మంది అగ్నిమాపక సిబ్బంది మృతి చెందగా, 87 మంది గాయాలపాలయ్యారన్నారు. ఆ అమరవీరుల జ్ఞాపకార్థం ప్రతి ఏటా ఏప్రిల్ 14 నుంచి అగ్నిమాపక వారోత్సవాలు జరుపుకుంటామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం రూ. 250 కోట్లతో అగ్నిమాపక విభాగాన్ని ఆధునీకరించేందుకు చర్యలు చేపట్టామన్నారు.

---------------------------

ప్రజల ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి ఈరోజు పంపిణీ చేశారు. మొత్తం 51 మందికి 42 లక్షల రూపాయల చెక్కులు పంపిణీ చేశారు. చాలా మంది అవగాహన లేక ముందు చికిత్స చేయించుకున్న అనంతరం సహాయానికి దరఖాస్తు చేస్తున్నారని, అలా కాకుండా చికిత్సకు ముందే తమ కార్యాలయంలో సంప్రదించాలని మంత్రి పేర్కొంటూ...

..వాయిస్ 32 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో మైనింగ్ రంగంతో సుస్థిరాభివృద్ధి సాధనకు, పెట్టుబడులు ప్రోత్సహించేందుకు వివిధ సవరణలతో 'ఆంధ్రప్రదేశ్ చిన్నతరహా ఖనిజాల పాలసీ-2025'ని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు పరిశ్రమల శాఖ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. మైనింగ్ రంగంలో ఉపాధి అవకాశాలు పెంచడం, కార్యకలాపాలు సులభతరం చేయడమే లక్ష్యంగా ఈ పాలసీని రూపొందించినట్లు అధికారులు వెల్లడించారు. ఖనిజ వనరుల నిర్వహణతో ఆర్థిక పురోగతి సాధించడంతో పాటు స్వర్ణాంధ్ర విజన్-2047 సాధనకు దోహదపడేలా ఈ పాలసీని తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు.

---------------------------

పట్టణాలు, నగరాల్లో ఈ-వ్యర్థాల పూర్తి స్థాయిలో సేకరించాలని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీరింగ్ అధికారులతో మంత్రి ఈ రోజు శ్రవణ మాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ-వ్యర్థాల సేకరణ ఇకపై నిరంతరం జరిగేలా సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని అధికారులు నిర్వహిస్తున్నారు. నెల్లూరులో జరిగిన స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీని మంత్రి ప్రారంభించారు.

కర్నూలు నగరంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా ఈ- వ్యర్థాలపై అవగాహన ర్యాలీ ని మంత్రి టీజీ. భరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ- వ్యర్థాలను నీటిలో పారవేయడం వల్ల ఎంతో నష్టమని పేర్కొంటూ...

...వాయిస్...30 సెకన్లు

---------------------------

ఇళ్ళు లేని పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ నూతన మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులైన ఎం.శివప్రసాద్ మంత్రిని క్యాంపు కార్యాలయంలో నిన్న మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... జూన్ నాటికి నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకు ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి నిర్మాణాలను వేగవంతం చేయాలని మంత్రి సూచించారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 27 సెకన్లు....

---------------------------

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు సర్దార్ గౌతులచ్చన్న వర్ధంతి ఈరోజు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న వ్యక్తి గౌతులచ్చన్న. కుల, మతాలకు అతీతంగా ప్రజలకు దారిచూపిన మహోన్నత వ్యక్తి ఆయన. అణగారిన వర్గాల సంక్షేమానికి విశేష కృషిచేసిన ఆ మహనీయునికి ప్రజలు ఘనంగా నివాళులర్పిస్తున్నారు.

---------------------------

బడుగు, బలహీన వర్గాల కోసం అలుపెరగని పోరాటం చేసిన ఉద్యమకారులు సర్దార్ గౌతు లచ్చన్న అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు అన్నారు. స్వాతంత్ర సమరయోధుడిగానే కాక, దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన వ్యక్తిగా ఆయన పేర్కొన్నారు. ఈరోజు లచ్చన్న 19వ వర్థంతి సందర్భంగా ఆయనకు మంత్రి ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బలహీన వర్గాలు, రైతులు, కార్మికుల ప్రగతి, సంక్షేమం కోసం లచ్చన్న చేసిన ఉద్యమాలు చిరస్మరణీయం. ఆయన ఉత్తరాంధ్రుడు కావడం ఆ ప్రాంతం చేసుకున్న అదృష్టంగా భావిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. బీసీల అభ్యున్నతి కోసం ఎనలేని కృషి చేసిన ఆచ్చన్నను నేటితరం నాయకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

======================